రజిని సాయిచంద్‌ను ఆశీర్వదించిన సింగిరెడ్డి దంపతులు

రజిని సాయిచంద్‌కు స్వీటు తినిపిస్తున్న సింగిరెడ్డి దంపతులు

వనపర్తి టౌన్, మార్చి 4 : గిడ్డంగుల శాఖ కార్పొరేషన్ మాజీ చైర్మన్ రజిని సాయిచంద్‌ను మంగళవారం మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి దంపతులు హైదరాబాద్‌లో ఆమెను ఆశీర్వదించారు. ఆమె జన్మదినాన్ని పురస్కరించుకొని ఆమెకు మిఠాయిలు తినిపించి శుభాకాంక్షలు తెలిపి ఆశీర్వదించారు.

నేటి నుంచి ఇంటర్ పరీక్షలు

- జోగుళాంబ గద్వాల జిల్లాలో 14, వనపర్తి జిల్లాలో 25 కేంద్రాలు
- రెండు జిల్లాల్లో కలిపి హాజరు కానున్న 20,491 మంది విద్యార్థులు
- 5 నిమిషాలు ఆలస్యమైనా అనుమతి
- పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు

అయిజ : ప్రభుత్వ జూనియర్ కళాశాలలో హాల్ టికెట్ నెంబర్లు వేస్తున్న సీఎస్, డీవోలు, ఇన్విజిలేటర్లు

గద్వాలటౌన్/అయిజ/వనపర్తి టౌన్, మార్చి 4 : బుధవారం నుంచి ఇంటర్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఈనెల 22 వరకు ఇంటర్ థియరీ, ఒకేషనల్ కోర్సులకు ఇంటర్ బోర్డు పరీక్షలు నిర్వహిస్తోంది. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్ష జరగనుండా.. ఉదయం 8 గంటల నుంచి పరీక్ష కేంద్రాల్లోకి అనుమతిస్తున్నారు. 5 నిమిషాలు ఆలస్యమైనా అనుమతినివ్వరు. కేంద్రాల పరిసరాల్లో ఎస్సై శ్రీనివాసరావు ఆధ్వర్యంలో 144 సెక్షన్ అమలు చేయనున్నారు. కేంద్రాల్లో సీసీ కెమెరాల తోపాటు జీపీఎస్ సిస్టంను ఏర్పాటు చేశారు. కాపీయింగ్‌ను నివారించడానికి కేంద్రాలపై గ్లోబల్ పొజిషన్ సిస్టమ్ నిఘాను ఉంచనున్నారు. ఇప్పటికే అధికారులు సర్వం సిద్ధం చేశారు.

జోగుళాంబ గద్వాల జిల్లా వ్యాప్తంగా ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు బుధవారం నుంచి ప్రారంభంకానున్నాయి. పరీక్షల నిర్వహణ కోసం జిల్లాలో 14 కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇంటర్ మొదటి సంవత్సరంలో జనరల్ 3,260మంది విద్యార్థులు, ద్వితీయ సంవత్సరంలో 3,396మంది విద్యార్థులు హాజరుకానున్నారు. అలాగే ఒకేషనల్ కోర్సు విద్యార్థుల మొదటి సంవత్సరంలో 797మంది, ద్వితీయ సంవత్సంలో 715 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. ప్రైవేట్ విద్యార్థులు 173మంది విద్యార్థుల పరీక్షలు రాయనున్నారు. మొత్తం 8,341మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారు. పరీక్షల నిర్వహణకు దాదాపు 240మంది ఇన్విజిలేటర్లు, 14 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 14 మంది డిపార్టుమెంటల్ అధికారులు, ఒక ఫ్లయింగ్ స్క్వాడ్, సిట్టింగ్ స్క్వాడ్‌లను నియమించారు. పరీక్షల నిర్వహణ కోసం ఏర్పాటు చేసిన కేంద్రాలను ఇంటర్ నోడల్ అధికారి హృదయరాజు మంగళవారం సందర్శించారు.

అయిజ పట్టణంలోని ప్రభుత్వ, హరి హర, అరోరా జూనియర్ కళాశాలల్లో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయగా.. 980 మంది పరీక్షలు రాయనున్నారు. ముగ్గురు సీఎస్‌లు, ముగ్గురు డీవోలు, ఒక పేపర్ కస్టోడియన్‌ను నియమించారు.

వనపర్తి జిల్లావ్యాప్తంగా 25 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఇంటర్మీడియట్ జిల్లా విద్యాధికారి అంజయ్య తెలిపారు. 25 కేంద్రాల్లో 12,150 మంది విద్యార్థులు పరీక్షలు హాజరుకానున్నారని డీఐఈవో తెలిపారు. అందులో మొదటి సంవత్సరం విద్యార్థులు 6,457ఉండగా, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 5, 693 మంది విద్యార్థులు హాజరుకానున్నట్లు చెప్పారు. ఈ పరీక్షల నిర్వహణకు 25 మంది సీఎస్‌లు, 25 డీవోలతోపాటు ఒక ఫ్లయింగ్ స్క్వాడ్, రెండు సిట్టింగ్ స్క్వాడ్స్, 600 మంది ఇన్విజిలేటర్స్ విధులు నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఏర్పాట్లు పూర్తి

ఇంటర్ పరీక్షలకు మూడు కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు చేశామని ఆయా జిల్లాల డీఐఈవోలు తెలిపారు. ఇప్పటికే సీసీ కెమెరాలు బిగించడంతోపాటు జీపీఎస్ సిస్టమ్ ఏర్పాటు చేశామని తెలిపారు. పరీక్షలు పకడ్బందీగా నిర్వహిస్తామన్నారు. సీఎస్‌లు, డీవోలతోపాటు ఇన్విజిలేట్లను అధికారులు నియమించారు. విద్యార్థులు పరీక్ష సమయానికి గంట ముందుగానే చేరుకోవాలని విద్యార్థులకు సూచించారు.

రాబోయే రోజులు బీఆర్ఎస్ పార్టీవే

- ఎమ్మెల్యే విజయుడు



క్యాలెండర్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే

అలంపూర్ చౌరస్తా, మార్చి 4 : పదేళ్లపాటు ప్రజల అభివృద్ధే ధ్యేయంగా కేసీఆర్ పాలన సాగిందని ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందించిన ఘనత ఒక్క బీఆర్ఎస్‌కే దక్కిందని ఎమ్మెల్యే విజయుడు అన్నారు. మంగళవారం బీఆర్ఎస్ పార్టీ వార్షికోత్సవం సందర్భంగా బీఆర్ఎస్ క్యాలెండర్, డైరీలను కార్యకర్తలు ఎమ్మెల్యే చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి ఏడాదిన్నర పూర్తయినా ప్రజలకు ఇచ్చిన హామీలు మాత్రం అమలు చేయలేదన్నారు. ప్రజలు బీఆర్ఎస్‌నే నమ్ముతున్నారని, రాబోయే రోజుల్లో మళ్లీ మంచి రోజులు వస్తాయన్నారు. కార్యక్రమంలో సింగిల్ విండో అధ్యక్షుడు గజేందర్‌రెడ్డి, రఘు రెడ్డి, గోపాల్ బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అభ్యర్థులకు ఇబ్బందులు లేకుండా చూడాలి

- కలెక్టర్ సంతోష్‌కుమార్

పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ

ఎర్రవల్లి చౌరస్తా, మార్చి 4: జాతీయ అర్హత పరీక్ష యూజీనీట్ అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కట్టుదిట్ట వైఖరి ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ సంతోష్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం ఎస్పీ ఎర్రవల్లి మండలంలోని సరస్వతీ పాఠశాలలో ఏర్పాటు చేసిన ప్రవేశపరీక్ష కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. యూజీనీట్ 2025 మే4 నిర్వహించనున్న పరీక్షకు సంబంధించిన మార్గదర్శకాలను పాటించాలని తెలిపారు. పరీక్ష కేంద్రాల్లో తగిన మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రశ్న పత్రాల భద్రత కోసం ప్రత్యేక ఏర్పాటుచేయాలని పరీక్షకేంద్రాల్లో విద్యుత్ సరఫరా తాగునీటి సదుపాయాలు పరిశుభ్రత, వసతులు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉండేలా చూడాలని ఆదేశించారు. దివ్యాంగ విద్యార్థులకు ప్రత్యేక సదుపాయాలు కల్పించాలని పరీక్ష కేంద్రాల వద్ద ప్రశాంత వాతవరణంలో జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీఈవో అబ్దుల్‌ఘని, కో-ఆర్డినేటర్ వెంకటేశ్, ప్రిన్సిపాల్ రాములు, గోవర్ధన్‌రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, నందిని, సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలకు భద్రత కట్టుదిట్టం

- పరీక్ష సమయంలో జిరాక్స్ సెంటర్లు మూసివేయాలి
- ఎస్పీ రావుల గిరిధర్

వనపర్తి టౌన్, మార్చి 4 : మార్చి 5 నుంచి 25వ తేదీ వరకు జరుగనున్న ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలకు కట్టుదిట్టమైన భద్రత చర్యలు చేపట్టనున్నట్లు ఎస్పీ రావుల గిరిధర్ చెప్పారు. జిల్లావ్యాప్తంగా మొత్తం 25 పరీక్ష కేంద్రాల్లో పరీక్షలు కొనసాగనున్నట్లు చెప్పారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు జరుగాయని ఆ సమయంలో కేంద్రాల వద్ద 163 బీఎన్ఎస్ఎస్-2023 (144) సీఆర్‌పీసీ చట్టం అమలులో ఉంటుందని ఎస్పీ చెప్పారు. పరీక్ష సమయంలో జిరాక్స్ సెంటర్లు మూసి వేయాలని, పరీక్ష కేంద్రాల వద్ద నుంచి 500 మీటర్ల వరకు ప్రజలు గుమికూడకూడదని చెప్పారు. పరీక్షలకు కట్టుదిట్ట వైఖరి భద్రతా చర్యలు ఏర్పాటు చేశామని తెలిపారు. పరీక్ష సమయానికి గంట ముందే విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని, మానసికంగా ఎటువంటి ఆందోళన చెందకుండా ప్రశాంతంగా పరీక్షలు రాయాలని ఎస్పీ విద్యార్థులకు సూచించారు.

జిల్లావ్యాప్తంగా 30 పోలీస్ యాక్ట్ అమలు

- ఎస్పీ రావుల గిరిధర్

వనపర్తి టౌన్, మార్చి 4 : శాంతి భద్రతల పరిరక్షణ దృష్ట్యా వనపర్తి జిల్లావ్యాప్తంగా నెల రోజులపాటు 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉంటుందని ఎస్పీ రావుల గిరిధర్ తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ 30 పోలీస్ యాక్ట్ మార్చి 1 నుంచి 31 వరకు అమలులో ఉన్నందున జిల్లాలో పోలీసు అధికారుల అనుమతులు లేకుండా ఎలాంటి ర్యాలీలు, సమావేశాలు, ఊరేగింపులు, ధర్నాలు, ఫంక్షన్ హాళ్లలో కార్యక్రమాలు నిర్వహించడానికి సన్నాహాలు చేయరాదని పేర్కొన్నారు. చట్టపరంగా జారీ చేసిన ఆదేశాలను ఎవరైనా ఉల్లంఘించినట్లయితే 30 పోలీస్ యాక్ట్ ప్రకారం శిక్షకు అర్హులవుతారన్నారు. ఎలాంటి కార్యక్రమాలు నిర్వహించాలన్నా ముందస్తు దరఖాస్తు చేసుకొని అనుమతులు తీసుకోవాలని ఎస్పీ కోరారు.

విలీనం చేయొద్దు

వనపర్తిటౌన్, మార్చి 4 : వనపర్తి మున్సిపాలిటీలో చిట్యాల గ్రామాన్ని విలీనం చేయొద్దని కోరుతూ మంగళవారం గ్రామ నాయకులు, గ్రామస్తులు ఎమ్మెల్యే మేఘారెడ్డి, కలెక్టర్ ఆదర్శ్ సురభికి వేర్వేరుగా వినతి పత్రాన్ని అందజేశారు. అందుకు ఎమ్మెల్యే స్పందిస్తూ గ్రామసభ నిర్వహించి నిర్ణయం తీసుకోవాలని కలెక్టర్‌కు ఎమ్మెల్యే తెలిపారు.

31లోపు ఎల్ ఆర్ఎస్ చేయించుకోవాలి

వనపర్తి టౌన్, మార్చి 4 : మార్చి 31 చివరి నాటికి 25 శాతం రాయితీతో ఎల్ఆర్ఎస్ చేయించుకోవాలని, ఎల్ఆర్ఎస్ లేని వారు మార్చి 31 తర్వాత ఇల్లు కట్టుకోవాలనుకుంటే ఎలాంటి రాయితీ లేకుండా ప్రస్తుత మార్కెట్ విలువకు 14 శాతం ఫెనాల్టీతో రిజిస్ట్రేషన్ చేయించుకోవాల్సి ఉంటుందని కలెక్టర్ ఆదర్శ్ సురభి అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని మున్సిపాలిటీ కార్యాలయ సమావేశ మందిరంలో మున్సిపల్ కమిషనర్లు, టౌన్ ప్లానర్లు, లేఅవుట్ రైటర్‌లు, బిల్లర్లతో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో కలెక్టర్ హాజరయ్యారు. 2020 తర్వాత కచ్చా లేఔట్ చేసిన వారు, వాటిలో ప్లాట్‌లు తీసుకున్న వారు జిల్లాలో 29 వేల మంది ఎల్ఆర్ఎస్ కోసం దరఖాస్తు చేసుకున్నారని, కానీ ఇప్పుడు క్రమబద్ధీకరణ చేసుకునేందుకు కేవలం 38మంది మాత్రమే ముందుకు వచ్చి డబ్బులు చెల్లించడం జరిగిందన్నారు. నిషేధిత స్థలం లేదా చెరువు, కుంట కింద లేకుంటే ప్లాట్ యజమాని ఫోన్‌కు నేరుగా ఎంత డబ్బులు కట్టాలో సమాచారం వెళ్తుందన్నారు. ఎదేనా కారణంచే ఎల్ఆర్ఎస్ తిరస్కరణకు గురైతే చెల్లించిన డబ్బుల నుంచి 10 శాతం ప్రాసెసింగ్ ఫీజు కింద మినహాయించుకొని మిగిలిన 90 శాతం డబ్బులు తిరిగి ప్లాటు యజమాని ఖాతాలో జమ చేస్తామని వివరించారు. వనపర్తి పురపాలికలో 2025-26 ఆర్థిక సంవత్సరానికి రూ.45.11కోట్ల వార్షిక అంచనా బడ్జెట్‌ను కలెక్టర్ ఆదర్శ్ సురభి అమోదించారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో కలెక్టర్ అధ్యక్షతన 2024-25 సవరించిన బడ్జెట్, ఇప్పటి వరకు అయిన ఖర్చులు, 2025-26 ఆర్థిక సంవత్సరంలో అంచనా బడ్జెట్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ అకౌంటెంట్ కృష్ణయ్య బడ్జెట్ వివరాలను చదివి వినిపించారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో రూ.26.36 కోట్ల అంచనా బడ్జెట్‌ను ప్రతిపాదించగా 2025 సవరించిన బడ్జెట్ విలువ రూ.39.28 కోట్ల ఆదాయంగా పద్దులో చూపించారు. ఇప్పటి వరకు ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.11.67కోట్లు వివిధ అభివృద్ధి పనులకు ఖర్చు చేసినట్లు తెలిపారు. 2025-26 సంవత్సరంలో దాదాపు రూ.45.11కోట్ల ఆదాయం వివిధ మార్గాల ద్వారా సమకూరనున్నట్లు అంచనా వేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నిధులు సమకూర్చుకుంటేనే అభివృద్ధి సాధించవచ్చని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు యాదయ్య, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, సబ్ రిజిస్ట్రార్, మున్సిపల్ కమిషనర్లు, బిల్డర్లు, లే అవుట్ ప్లానింగ్ ఇంజినీర్లు, కొత్త కోట, అమరచింత, పెబ్బేరు మున్సిపాలిటీల కమిషనర్లు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల ముందస్తు అరెస్టులు

అలంపూర్, మార్చి 4: ప్రభుత్వం అంగన్‌వాడీలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలంటూ ప్రజా దర్బార్‌లో వినతి పత్రాలు ఇచ్చేందుకు వెళ్తున్న అంగన్‌వాడీలను ముందస్తుగా హౌస్ అరెస్టు చేయడం దారుణమని, కాంగ్రెస్ ప్రభుత్వం పేరుకే ప్రజాపాలన కొనసాగిస్తున్నదని, క్షేత్రస్థాయిలో మాత్రం ప్రజా వ్యతిరేక పాలన నడుస్తుందని సీఐటీయూ జిల్లా నాయకురాలు, అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఎమేలమ్మ ఆరోపించారు. మంగళవారం హైదరాబాద్‌లో నిర్వహించిన ప్రజా దర్బార్‌లో వినతిపత్రాలు సమర్పించడానికి వెళ్తున్న అంగన్‌వాడీలను అలంపూర్‌లో పోలీసులు ముందస్తు అరెస్టులు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మినీ అంగన్‌వాడీలను మెయిన్ అంగన్‌వాడీలుగా గుర్తించి వేతనాలు పెంచుతామని, ఇంత వరకు పెంచలేదన్నారు. సంవత్సరకాలంగా ఆయా (హెల్పర్) పోస్టులను భర్తీచేయడం లేదని విమర్శించారు. మినీ అంగన్‌వాడీ కేంద్రాల్లో టీచర్స్ విధులు, ఆయా విధులు రెండు కూడా టీచర్లే నిర్వర్తించాల్సి వస్తుందని వాపోయారు. పని భారం పెరిగిందే కాని వేతనాలు పెంచలేదని, ఖాళీలను భర్తీ చేయలేదని ధ్వజమెత్తారు. అదేవిధంగా ప్రభుత్వ పాఠశాలల మాదిరిగా వేసవి సెలవులు అంగన్‌వాడీలకు కూడా సెలవులు అమలు చేయాలని డిమాండ్ చేశారు.

అమరచింతలో..

అమరచింత, మార్చి 4 : మీని అంగన్‌వాడీ సెంటర్లల్లో పని చేస్తున్న టీచర్లకు, ఆయాలకు పెండింగ్ వేతనాలను తక్షణమే చెల్లించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు నిక్సన్ డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ ఉద్యోగులు పెండింగ్ వేతనాలను చెల్లించాలని మంగళవారం సీఐటీయూ ఆధ్వర్యంలో ఆత్మకూర్ సీడీపీవో కార్యాలయం ఎదుట అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలతో ధర్నా నిర్వహించారు. పెండింగ్‌లో వేతనాలను చెల్లించాలని డిమాండ్ చేస్తూ సీడీపీవో కార్యాలయంలో అధికారికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ ఉద్యోగులు, ఆయా సంఘాల నాయకులు తదితరులు ఉన్నారు.

ఇండ్లకు నెంబర్ ప్లేట్ల బిగింపును నిలిపివేయాలి

ప్లేట్ల బిగింపును నిలిపివేయాలని సిబ్బంది ఆదేశిస్తున్న ఆర్ఐ మధు

అయిజ, మార్చి 4 : మున్సిపాలిటీలోని ఇండ్లకు నెంబర్ ప్లేట్ల బిగింపు పనులు పూర్తిగా నిలిపివేయాలని మున్సిపల్ ఆర్ఐ మధు డాల్ఫిన్ రూరల్ డెవలప్‌మెంట్ అర్బన్ సొసైటీ ఏజెన్సీ సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం పట్టణంలోని ఎస్సీ కాలనీలో ఇండ్లకు నెంబర్ ప్లేట్లు బిగించేందుకు వెళ్లిన ఏజెన్సీ సిబ్బందిపై మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో కాలనీకి చేరుకున్న ఆర్ఐ ప్రైవేటు ఏజెన్సీ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గత నెల 14న సోషల్ మీడియాలో వచ్చిన కథనాలపై స్పందించిన కమిషనర్ సీహెచ్ సైదులు తక్షణమే నెంబర్ ప్లేట్ల బిగింపును నిలిపివేయాలని ఆదేశించారని ఆర్ఐ మధు తెలిపారు. ఇండ్లకు నాణ్యతలేని రేకులపై మార్కర్ పెన్నుతో ఇంటి నెంబర్లను రాసి అతికించి రూ.60వసూలు చేస్తున్నారని ప్రజలు కమిషనర్ దృష్టికి తెచ్చారు. దీంతో కమిషనర్ ఇండ్లకు నెంబర్ ప్లేట్ల బిగింపును నిలిపివేయాలని సూచించారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ లక్ష్మన్న, బిల్ కలెక్టర్లు ఉన్నారు.

సుందరీకరణ చర్యలు చేపట్టాలి

పరిశీలిస్తున్న కలెక్టర్, అధికారులు

గద్వాల, మార్చి 4 : గద్వాల కోట, లింగంబావి సైఫ్‌వెల్‌ను పునరుద్ధరించి, సుందరీకరణకు చర్యలు చేపట్టి ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలని కలెక్టర్ సంతోష్ అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని గద్వాల కోట, లింగం బావిని అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ చారిత్రక కట్టడాలను పునరుద్ధరించి భవిష్యత్ తరాలకు అందించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. లింగం బావి పునరుద్ధరణలో భాగంగా ప్రదేశం ఆకర్షణీయంగా మారేందుకు ల్యాండ్ స్కేపింగ్ పనులు చేపట్టాలన్నారు. కలెక్టర్ వెంట మున్సిపల్ కమిషనర్ దశరథం, అధికారులు శ్రీలేఖ ఉన్నారు.

ప్లాట్ల క్రమబద్ధీకరణకు 25శాతం రిబేటు

జిల్లాలో ప్లాట్ల క్రమబద్ధీకరణ కోసం మార్చి 31వ తేదీలోపు దరఖాస్తులు చేసుకునే వారికి ప్రభుత్వం 25 శాతం రాయితీ సౌకర్యాన్ని వర్తింపజేస్తుందని కలెక్టర్ సంతోష్ వెల్లడించారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయంలోని సమావేశంలో సంబంధిత అధికారులకు ఎల్‌టీపీలతో, డాక్యుమెంట్ రైటర్లు, లేఅవుట్ డెవలపర్లతో ప్లాట్ల క్రమబద్ధీకరణపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం నాన్ లేఅవుట్ ప్లాట్ల క్రమబద్ధీకరణకు 25 శాతం రాయితీ సదుపాయం కల్పించిందన్నారు. ఈ అవకాశం 2020ఆగస్టు 26వ తేదీలోపు దాఖలైనా ఎల్ఆర్ఎస్ దరఖాస్తులకు మాత్రమే వర్తిస్తుందన్నారు. సమావేశంలో డీపీవో నాగేంద్రం పాల్గొన్నారు.

సీసీరోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు

అమరచింత, మార్చి 4 : అమరచింత పురపాలిక కార్యాలయం మీదుగా అమరచింత, మరికల్ ప్రధాన రహదారి నుంచి చంద్రనాయిక్ తండా వరకు సీసీరోడ్డు నిర్మాణ పనులను చేపట్టేందుకు పురపాలక ముఖ్య కార్యదర్శి టీకే రూ.52ల క్షల నిధులను మంజూరు చేసినట్లుగా అమరచింత వాసులు మాదరం చిన్నవెంకట్‌రెడ్డి, జయసింహారెడ్డి, దేశాయ్ ప్రకాశ్‌రెడ్డి సేవా సమితి అధ్యక్షుడు సయ్యద్ కలాంపాషా తెలిపారు. మంగళవారం వారు స్థానిక విలేకరులతో మాట్లాడుతూ గత నెలలో మాజీ అడ్వకేట్ జనరల్ దేశాయ్ ప్రకాశ్‌రెడ్డి విజ్ఞప్తి మేరకు అమరచింత పురపాలక సంఘం కార్యాలయాన్ని సందర్శించగా మరికల్ ప్రధాన రహదారి నుంచి పురపాలక కార్యాలయం మీదుగా చంద్రనాయిక్ తండా వరకు సీసీరోడ్డు నిర్మాణ నిధులను మంజూరు చేయాలని కోరగా రూ.52ల క్షల నిధులను విడుదల చేస్తూ జీవో జారీ చేశారని వారు సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా కమిటీ సభ్యుడు శ్యాం పాల్గొన్నారు.

రేషన్‌కార్డుల పంపిణీ ఎప్పుడు?

వడ్డేపల్లి, మార్చి 4: కొత్త రేషన్ కార్డుల కోసం ప్రజలు ఎదురు చూడాల్సి వస్తుంది. కొత్త కార్డులు ఇస్తామని, కొత్తవారిని కూడా చేర్చవచ్చని దరఖాస్తులు చేసుకోవాలని అధికారులు హడావిడీ చేసిన విషయం తెలిసిందే. గ్రామాల్లో కొత్తరేషన్ కార్డులు మంజూరైనా వారి జాబితాను కూడా చదివి వినిపించారు, కాని ఇంతవరకు వాటి జాడ లేదన్నారు. ఈ విషయంపై ఉప తాసీల్దార్ శ్రీకాంత్ రెడ్డిని వివరణ కోరగా ఇప్పటి వరకు తమకు ఎలాంటి సమాచారం రాలేదని సమాధానమిచ్చాడు.

జాతీయ రహదారిపై రెండు కంటైనర్లు ఢీ

కొత్త కోట, మార్చి 4 : కొత్తకోట మండలంలోని నాట వెల్లి గ్రామం జాతీయ రహదారి 44పై మంగళవారం రెండు కంటైనర్లు ఢీకొన్న ఘటన నెలకొన్నది. ఎస్సై ఆనంద్ కథనం మేరకు హైదరాబాద్ నుంచి కర్నూల్ వైపు వెళ్తున్న కొత్త కార్ల లోడ్‌తో ఉన్న రెండు భారీ కంటైనర్లు ఒకదానినొకటి ఢీ కొన్నాయని, దాని వెనకాల వస్తున్న డీసీఎం, లారీలు కూడా వాటితోపాటు అదుపు తప్పి కంటైనర్లను ఢీ కొన్నాయని ఎస్సై తెలిపారు. దీంతో జాతీయ రహదారిపై వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగిందని, వెంటనే పోలీసులు, జాతీయ రహదారి నిర్వహణ సిబ్బంది అక్కడికి చేరుకొని వాహనాలను తొలగించామని ఆయన తెలిపారు. ప్రమాదంలో ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదని ఎస్సై ఆనంద్ పేర్కొన్నారు.

సబ్ స్టేషన్ ఆకస్మిక తనిఖీ

గద్వాల అర్బన్, మార్చి 4 : విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా విద్యుత్ అధికారులు చూసుకోవాలని విద్యుత్ చీఫ్ ఇంజినీర్, జిల్లా నోడల్ ఆఫీసర్ భాస్కర్ అన్నారు. మంగళవారం గద్వాల మండలం వీరాపురం సబ్‌స్టేషన్‌లో ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యుత్ సరఫరాపై ఆపరేటర్ కుమార్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎలాంటి అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా చేయాలని, సిబ్బందిని డ్యూటీలో అలర్ట్‌గా 24 గంటలు ప్రమత్తంగా ఉండేలా చూసుకోవాలని హెచ్చరించారు..

జాబ్ కార్డులు కలిగిన ప్రతి ఒక్కరికీ ఉపాధి పనులు

సోషల్ ఆడిట్ నిర్వహిస్తున్న డీఆర్డీవో

అయిజ, మార్చి 4: ఉపాధిహామీ పథకం కింద జాబ్‌కార్డులు కలిగిన ప్రతి ఒక్కరికీ పనులు కల్పిస్తున్నట్లు డీఆర్డీవో నర్సింగరావు అన్నారు. మంగళవారం పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో 2023-24 ఏడాదికిగానూ 14వ విడత సామాజిక తనిఖీ ప్రజా వేదిక సమావేశం నిర్వహించారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ 2023, ఏప్రిల్ 1 నుంచి 2024, మార్చి 31వరకు మండలంలోని 28 పంచాయతీల్లో రూ.3,78,70,008తో 517 పనులు చేపట్టామన్నారు. అందులో ఉపాధిహామీ కూలీలకు రూ.3.53, 11,071 కోట్లు చెల్లించామన్నారు. మెటీరియల్ కింద రూ. 25,58,937 వెచ్చించామని తెలిపారు. పంచాయతీల్లో మొక్కల పెంపకం, నర్సరీల నిర్వహణ, మొక్కలకు నీటిని అందించడం వంటి పనులు చేపట్టామన్నారు. చిన్న తాండ్రపాడు ఫీల్డ్ అసిస్టెంట్‌పై గ్రామస్తులు డీఆర్డీవోకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదుపై విచారణ చేస్తామని, కూలీలకు తగిన న్యాయం చేస్తామని గ్రామస్తులకు డీఆర్డీవో హామీ ఇచ్చారు. ఆయా గ్రామాలకు సంబంధించిన ఆడిట్ ముగిసిందని, త్వరలోనే వివరాలను వెల్లడిస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఏపీడీ శ్రీనివాసులు, ఎంపీడీవో వెంకటయ్య, క్వాలిటీ కంట్రోల్ అధికారులు చాముండేశ్వరి, అశోక్, అంబుడ్స్ మెన్ జమ్మన్న, ఎస్ఆర్పీ బాలునాయక్, ఈసీ అశోక్, డీఆర్పీలు, వీఆర్పీలు పాల్గొన్నారు.

మహిళలతోనే సమగ్ర అభివృద్ధి

వనపర్తి టౌన్, మార్చి 4 : మహిళా సాధికారత తోనే సమగ్ర అభివృద్ధి జరుగుతుందని జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ న్యాయ మూర్తి రజిని అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఎస్వీఎంఆర్ డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాలలో భాగంగా జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ రాజ్యాంగం కల్పించిన హక్కులను చట్టాలను వినియోగించుకొని మహిళలు అన్ని రంగాల్లో అత్యున్నతమైన స్థానంలో ఉండాలన్నారు. బాల్య వివాహాలు, ఫోక్సో చట్టం, బాల కార్మికుల చట్టం, మోటారు వెహికిల్ చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సిబ్బంది చాంద్‌పాషా, కల్పన పాల్గొన్నారు.

సాగు లక్ష్యాలను సాధించాలి

వనపర్తి టౌన్, మార్చి 4 : జిల్లాలో 2025-26 ఏడాదికి సంబంధించిన అయిల్ ఫామ్ సాగు విస్తీర్ణ లక్ష్యాలను సాధించాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ సమావేశ మందిరంలో వ్యవసాయ, ఉద్యాన శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో వ్యవసాయ అధికారి గోవిందు నాయక్, ఉద్యాన శాఖ అధికారి అక్బర్, ఏఎం వోటు ఉన్నారు.

టెన్త్ ఫెయిల్ నుంచి పీహెచ్‌డీ దాక

పాన్‌గల్, మార్చి 4 : మండలకేంద్రానికి చెందిన గెంటేల రాంబాబు ఉస్మానియా యూనివర్శిటీ డాక్టర్‌పట్టా ప్రదానం చేసింది. ఆయన ప్రస్తుతం కాస్ట్ అకౌంటెం